క్లుప్తంగా

ఉచితంగా కందులు పంపిణీ



కందులు పంపిణీ చేస్తున్న ఏఓ

దౌల్తాబాద్: మండలంలోని రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద స్థానిక కోఆపరేటివ్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉచితంగా కందులను ఏఓ లావణ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలానికి 4కిలోల చొప్పున 700 బస్తాలు వచ్చాయని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ఏఈఓలకు అందించి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే 700 బస్తాల రాగులు కూడా వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వైశాలి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు యూత్ కాంగ్రెస్ సమావేశం

కొడంగల్ రూరల్: జిల్లా కేంద్రంలో ఆలంపల్లి రోడ్‌లోని సత్యభారతి గార్డెన్‌లో 27వ తేదీన నిర్వహించనున్న యువజన కాంగ్రెస్ సమావేశాన్ని జయప్రదం చేయాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జూనియర్ కృష్ణంరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ప్రారంభం కానున్న సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నోట్‌బుక్కుల పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేస్తున్న వీరానందం

యాలాల: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నోట్‌బుక్కులను బుధవారం పంపిణీ చేశారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి వీరానందం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వసతి గృహంలో ప్రభుత్వ పరంగా అన్ని వసతులు, సౌకర్యాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం వడ్డిస్తున్నట్లు తెలిపారు.

బోడబండ పాఠశాలలో 13మంది చేరిక



ప్రయివేటు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్న లక్ష్మణ్‌నాయక్

బొంరాస్‌పేట: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేపడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. గిరిజన తండాల్లో తల్లిదండ్రులకు నచ్చజెప్పి వారి పిల్లలను ప్రయివేటు నుంచి తండాలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని అవగాహన కల్పిస్తున్నారు. వారిని సర్కారు బడుల్లో చేర్పిస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని బోడబండ తండాకు చెందిన 13మంది చిన్నారులను నాందార్‌పూర్, బాపల్లి న్యూ జనరేషన్, తుంకిమెట్ల ప్రయివేటు పాఠశాలలకు వెళ్తుండగా యువజన నాయకుడు లక్ష్మణ్‌నాయక్, పాఠశాల హెచ్‌ఎం సుమలత చొరవ చూపి తమ పాఠశాలలో చేర్పించారు. పాఠశాలలో ఏడుగురు ఉన్న విద్యార్థుల సంఖ్యను 20కి పెంచారు.

ట్రిప్పుల సంఖ్య పెంచాలని డీఎంకు వినతి

- 8నుంచి 2కు తగ్గించిన ఆర్టీసీ
- ఇబ్బందుల్లో నాగారం గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

ధారూరు: ప్రతిరోజు తమ గ్రామానికి ఎనిమిది ట్రిప్పుల ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం 6 ట్రిప్పులు రద్దు చేసి రెండుకే నడిపిస్తున్నారని ధారూరు మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ప్రజలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. వికారాబాద్ నుంచి జైదుపల్లి, గోదంగూడ, తరిగోపుల, మైలారం గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు 8 ట్రిప్పులు వేసేదని, రెండు ట్రిప్పులకు పరిమితం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటునట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులో కాలు పెట్టాలన్న సందులేని పరిస్థితి దాపురించిందని, దీని వల్ల విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమయానుకూలంగా బస్సు రాకపోవడంతో ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లిపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వెసులుబాటు కావడం లేదని వారు వాపోయారు. నాగారం గ్రామానికి రోజు ఉదయం 7:30, 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు, సాయంత్రం 4:30 గంటలకు, రాత్రి 7, 9 గంటల చొప్పున బస్సు నడపాలని వికారాబాద్ ఆర్టీసీ డీఎంను వారు కోరారు.

సాగుకు లాభసాటి..రైతు నేస్తం

- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం
- అధిక దిగుబడులు సాధించేలా కార్యక్రమాలు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు, సలహాలు ఇస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు
- జిల్లాలో 51 కేంద్రాల ఏర్పాటు



దౌల్తాబాద్ మండలంలోని రైతువేదికలో వీడియోకాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అధికారులు, రైతులు (ఫైల్)

దౌల్తాబాద్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతు నేస్తం పేరుతో సాగులో మెళుకువలు, సలహాలు, సూచనలు అందించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన రైతు వేదికల్లో దృశ్య శ్రవణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. పంట ఉత్పత్తులను పెంచే విధంగా నిపుణులు, శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అన్ని గ్రామాల రైతులు ఈ కార్యక్రమానికి హాజరై వీక్షించవచ్చు. మొదటి విడతగా మండలానికి ఒకటి చొప్పున 17 రైతు నేస్తం కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం హైదరాబాద్ నుంచి పలువురు శాస్త్రవేత్తలు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆధునిక వ్యవసాయ విధానాలతో పాటు సస్యరక్షణపై సలహాలిస్తారు. ఈ విధానం రైతులకు ప్రయోజనకరంగా ఉండడంతో మరిన్ని రైతునేస్తం కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో మరో 34 కేంద్రాలు మంజూరు చేశారు. వాటిని గత వారం ప్రారంభించారు.

అధిక దిగుబడులు సాధించేలా..

జిల్లాలోని 20 మండలాల్లో రైతువేదికలు నిర్మించి వాటి ద్వారా పలురకాల సలహాలు అందిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించే విధంగా రైతుల్లో మార్పు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమే రైతునేస్తం. దృశ్య శ్రవణ సేవల విస్తరణకు వ్యవసాయంతో పాటు దానికి అనుబంధంగా ఉండే ఉద్యాన, మత్స్య, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖలకు సంబంధించి సలహాలు అందజేస్తున్నారు.

లక్ష్యాలివే..

రైతునేస్తం ద్వారా రైతులకు అధికారులు పలురకాల ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. జిల్లాకు మంజూరైన యూనిట్లను రైతువేదికల్లో పంపిణీ చేస్తున్నారు. బీఎస్‌ఎన్ఎల్ నెట్‌వర్క్ సాయంతో దృశ్య శ్రవణ విధానం కొనసాగుతుంది. రైతులకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించారు. వాటి నిర్వహణ మొత్తం ఏఈఓలకు అప్పగించారు. టీవీ బ్యాటరీ తదితర విలువైన పరికరాలు కేంద్రాల్లో ఉంటాయి. గత వారం నిర్వహించిన రైతునేస్తం, హైదరాబాద్ నుంచి నిర్వహించిన రైతునేస్తం, రైతు భరోసా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పలుసూచనలు, సలహాలను వీడియోకాన్ఫరెన్స్‌లో రైతులు వీక్షించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

రైతునేస్తం వేదికల్లో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యాన, పశుసంవర్ధకశాఖ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో కార్యక్రమానికి హాజరయ్యే రైతులకు అన్ని రకాల సందేహాలు నివృత్తి అవుతున్నాయి. ఈ రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– మోహన్‌రెడ్డి, డీఏఓ, వికారబాద్

మహిళా సంఘాల అభివృద్ధే లక్ష్యం

ఎంపీడీఓ గ్యామా



మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: మహిళా సంఘాల అభివృద్ధే లక్ష్యమని ఎంపీడీఓ గ్యామా సూచించారు. బుధవారం దోమ మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య నూతన అధ్యక్ష, కార్యదర్శులకు శిక్షణ సమావేశాన్ని సెర్ప్ నుంచి హాజరైన సీఆర్‌పీలు రమ్య, సుజాతతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం మహిళా సంఘాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని, మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి గ్రామంలో సంఘాల బలోపేతానికి అనునిత్యం సమావేశాలను ఏర్పాటు చేసి మహిళలను చైతన్య పరిచే విధంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో కట్టించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. కాగా ఈ సమావేశానికి ఏపీఎం సురేశ్ ఆలస్యంగా రావడంతో ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో సీసీ నారాయణ, లక్ష్మారెడ్డి, బంగారప్ప, శ్రీశైలం, అనసూయ, అంజమ్మ, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



బండవెల్కిచర్ల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న సీఐ శ్రీనివాస్

సీఐ శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతిఒక్కరికీ సైబర్ నేరాలపై అవగాహన అవసరమని పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పంచాయతీలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ విషయాన్ని ఇళ్లలోని పెద్దవారికి తెలియజేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరు కూడా ఫోన్లలో మోసపూరిత గేమ్‌లు ఆడొద్దన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. మోసపూరిత ప్రకటనలను నమ్మడం, తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం వంటివి చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేశ్, దోమ ఎస్ఐ ఆనంద్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహనలో మాట్లాడుతున్న ఎస్ఐ సంతోశ్‌కుమార్

నవ సమాజ నిర్మాణానికి కృషి

పరిగి: గంజాయి, మాదక ద్రవ్యాలను నిర్మూలించి నవ సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని జాఫర్‌పల్లి గ్రామంలోని మోడల్ స్కూల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలను సేవించడం ద్వారా యువత చెడు మార్గాన్ని ఎంచుకుంటుందన్నారు. అంతే కాకా అవి సేవిస్తే యువత మంచి భవిష్యత్తును కోల్పోతుందన్నారు. మత్తుకు బానిసైతే జీవితం వ్యర్థమన్నారు. దీనికోసం ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గంజాయిని విక్రయించిన, సేవించిన చట్టరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు భవిష్యత్‌ను పాడు చేసుకోకుండా, మంచి మార్గాన్ని ఎంచుకుని రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భక్తితోనే మానసిక ప్రశాంతత

క్రిష్ణగిరి క్షేత్ర పీఠాధిపతి కృష్ణానందస్వామి

బషీరాబాద్: యాంత్రిక జీవనంలో ఉరుకులు, పరుగులతో మనుషులకు మానసిక ప్రశాంతత కరువైందని క్రిష్ణగిరి క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద స్వామి అన్నారు. దైవధ్యానంతో ముక్తి, మంచి ప్రవర్తన కలుగుతుందన్నారు. బుధవారం మండలంలోని జీవన్గీ గ్రామ సమీపంలోని కాగ్నానది ఒడ్డున వెలసిన జీవాశ్రమంలో శివలింగానికి రుద్రాభిషేకం, పుష్పాభిషేకం, మహా హోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పీఠాధిపతి హాజరై భక్తులకు ప్రవచనాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాగ్నానది ఒడ్డున వెలసిన శివలింగ జీవాశ్రమం భవిష్యత్‌లో భక్తసందోహంతో దినదినాభివృద్ధి చెందుతుందని తెలిపారు. కాశీ తరహాలో కాగ్నాలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి గంగాహారతి ఇస్తే సర్వ పాపాలు తొలుగుతాయన్నారు. అమావాస్య రోజున గంగాస్నానం చేసి శివారాధన చేస్తే శుభాలు కలుగుతాయని, ఇక నుంచి తాను కూడా అమావాస్యకు జీవక్షేత్రాన్ని సందర్శిస్తానని ప్రకటించారు. అంతకు ముందు స్వామిజీకి ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి భజనలు, కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, గ్రామ పెద్దలు మునీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వీరారెడ్డి, జగదీశ్వర్, నర్సిరెడ్డి, శరణమ్మ, ఆలయ నిర్వాహకులు రామని బసప్ప, రాములు, పోతురాజు నాగప్ప, కృపతి, వసంతప్ప, బాలక్రిష్ణ, అంజిలప్ప, భీమప్ప, నర్సప్ప, నర్సిములు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



కాగ్నా నదికి హారతి ఇస్తున్న కృష్ణానందస్వామి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేదలకు చేయూత



కుట్టుమిషన్లు అందిస్తున్న అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నితిన్‌కుమార్ మాలేట్కర్

ధారూరు: కేరెల్లి గ్రామంలోని శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రంలో బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, మగ్గం మెటీరియల్‌ను అందజేసింది. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ దినోత్సవం సందర్భంగా యూనియన్ సోషల్ రెస్పాన్సిబిలిటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రీజినల్ మేనేజర్ నితిన్‌కుమార్ మాలేట్కర్, చీఫ్ మేనేజర్ ఓపెన్‌మిట్టల్, అధికారులు కృష్ణకృతిక్, కిరణ్, ఖఆర్ యాదవ్, స్టాఫ్ యూనియన్ సభ్యులు, శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రం ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, బాల వికాస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అనంతగిరి: స్వర్గీయ తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఈ నెల 29న ఆయన స్వగ్రామం మక్తల్ నియోజకవర్గం అమరచింతలో నిర్వహించనున్నట్లు బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ తెలిపారు. ఈ మేరకు విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్‌ను వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లాలోని సాయిచంద్ అభిమానులు, ఉద్యమకారులు తరలిరావాలని కోరారు.

ఎప్పటికప్పుడు చెత్త సేకరించండి

జిల్లా పంచాయతీ అధికారి జయసుధ



అల్లిపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న జయసుధ

ధారూరు: ఎప్పటికప్పుడు చెత్త సేకరించాలని, గ్రామాల్లో పేరుకపోయి దుర్గంధం వ్యాపిస్తుందని, ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని జిల్లా పంచాయతి అధికారి జయసుధ పేర్కొన్నారు. ధారూరు మండలంలోని అల్లిపూర్ గ్రామాన్ని ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో చెత్త పేరుకపోవడాన్ని గమనించి వెంటనే ట్రాక్టర్ ద్వారా చెత్తను తొలగించాలని, డీజిల్ డబ్బులు ఇప్పిస్తామని గ్రామ కార్యదర్శి సునితకు సూచించారు. జీతం డబ్బులు అయిపోయాయని, జీపీలో డబ్బులు లేవు, అప్పుగా ఎవరు ఇవ్వడం లేదని, ట్రాక్టర్‌లో డీజిల్ ఎలా పోయించాలని కార్యదర్శి బదులిచ్చారు. కలెక్టర్ ద్వారా కొన్ని డబ్బులైన ఇప్పించాలని కార్యదర్శి డీపీఓను అభ్యర్థించింది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి డీజిల్ డబ్బులు రిలీజ్ చేయాలని కోరనున్నట్లు చెప్పారు. నర్సరీలోని మొక్కలను ఎక్కడ నాటుతారని ఆమె కార్యదర్శిని ప్రశ్నించారు. క్రిమిటోరియం వద్ద నాటనున్నట్లు తెలిపారు. డీపీఓ వెంట ఎంపీఓ షఫీఉల్లా, గ్రామస్తులు ఉన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీఓ

యాలాల: వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీఓ యాదయ్య సూచించారు. బుధవారం మండలంలోని నాగసముందర్ గ్రామంలో పాఠశాల, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగించుకోవాలని గ్రామ కార్యదర్శికి సూచించారు. గ్రామంలో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారు పంచాయతీ అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే భోజనం, వంట సామగ్రిని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటు సరికాదు

రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ధనరాజ్



వికారాబాద్‌లో బైక్ ర్యాలీ చేపడుతున్న నాయీ బ్రాహ్మణులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో కార్పొరేట్ సెలూన్లు ఏర్పాటు చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ధనరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలో కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటుకు నిరసనగా 5 రోజులుగా మూసివేశారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మా వృత్తి మీద దాడి చేస్తే మేం ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. వికారాబాద్ జిల్లాలో సుమారు 500 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ యువజన రాష్ట్ర నాయకులు వెంకట్‌సాయి, కార్యదర్శి రవీందర్, జిల్లా ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆ టీచర్‌ను సస్పెండ్ చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ, హిందూ వాహిని సభ్యులు

తాండూరు టౌన్: విద్యార్థులకు ఆవు మెదడును ప్రత్యక్షంగా తెచ్చి చూపించిన బయాలజీ టీచర్ కాసీంబీని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ ఏబీవీపీ, హిందూ వాహిని సభ్యులు తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాలాల మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్ ఆవు మెదడును పాఠశాలకు తెచ్చి విద్యార్థులకు చూపించడం బాధాకరమన్నారు. ఈ విషయంలో వెంటనే టీచర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు నర్సిములు, కార్యదర్శి చేతన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజయ్, నాయకులు చందు, హిందూ వాహిని జిల్లా కన్వీనర్ రాముసాగర్, గణేశ్, వినయ్ తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్

కుల్కచర్ల: వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని కుల్కచర్ల మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్ క్లబ్ కొత్తపేట ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 64మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 47మందికి శుక్లాల సమస్య ఉన్నట్లు గుర్తించారు. అత్యవసర చికిత్స అవసరం ఉన్న 30మందికి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్ తరలించారని ఆయన పేర్కొన్నారు. ప్రతీ బుధవారం కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలిక్ అసిస్టెంట్ జవహర్‌లాల్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ క్రిష్ణమోహన్ రెడ్డి, కో ఆర్డినేటర్ విజయవెంకటరంగా, వైద్యురాలు మాధురి, జిల్లాఫార్మసీ ఆఫీసర్ విజయకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ నవీన్, వైద్య సిబ్బంది సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం.. రైతుల్లో ఆనందం

ధారూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మోస్తరు వాన కురిసింది. దీంతో మొలకలకు జీవం పోసినట్‌లైందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూమిలోనే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉందని కొందరు హర్షం వ్యక్తం చేశారు. వాన పడిందని నాగారం, అంతారం, మోమిన్‌కలాన్, గురుదోట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలకు ఊపిరి..

దుద్యాల్: విత్తనాలు వేసిన నాటి నుంచి వర్షాలు పడకపోవడంతో భూమిలో వేసిన విత్తనాలు మొలకెత్తక, మొలకెత్తిన విత్తనాలు ఎండిపోతుండడంతో రైతన్న దిగాలు చెందుతున్నాడు. ఇదే సమయంలో బుధవారం సాయంత్రం మండల వ్యాప్తంగా మోస్తారు వర్షం కురిసింది. దీంతో మొక్కలకు ఊపిరిపోసినట్‌లైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అరగంట పాటు వర్షం ఏకధాటిగా పడడంతో వాతావరణం చల్లబడింది.

దంచి కొట్టిన వాన..

దోమ: మండల వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది. గంట పాటు ఎడతెరిపి లేకుండా కురువడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. విత్తనాలు విత్తుకొని రోజులు గడుస్తున్నప్పటికి వర్షం కోసం రైతన్నల ఎదురుచూపు తప్పలేదు. గంట పాటు వర్షం కురువడంతో సంతోషం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో సయ్యద్ జహంగిర్ రేకుల ఇళ్లు కుప్పకూలింది. అందులోనే హోటల్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

పరిగిలో..

పరిగి: పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం సాయంత్రం పరిగి ఇతర మండలాల్లో మోస్తరు వర్షం కురవడంతో ముందుగా సాగు చేసిన పంటలకు జీవం పోసినట్టు అయిందని రైతులు చెబుతున్నారు.



దుద్యాల్: హస్నాబాద్‌లో కురుస్తున్న వర్షం



దోమ: ఐనాపూర్‌లో వర్షానికి కూలిన ఇళ్లు

ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం



ర్యాలీలో మాట్లాడుతున్న శిరీష

అనంతగిరి: బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయమని పలువురు బీజేపీ నాయకులు తెలిపారు. బుధవారం వికారాబాద్ పట్టణంలో సంవిధాన్ హత్య దివాస్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు యంఆర్‌పీ చౌరాస్తాలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, బీజేపీ జిల్లా నాయకులు పాండుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్, సాయిచరణ్‌రెడ్డి, సుచరితారెడ్డి, నందు, తదితరులు పాల్గొన్నారు.